క్లుప్తంగా

నిధుల మంజూరుకు కేంద్ర మంత్రికి వినతి



వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

మల్యాల: మండలంలోని బల్వంతాపూర్‌లో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు సోమవారం నాయకులు వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నాయకులు సంగని రవి, గాజుల మల్లేశం, బొడిగె సురేశ్, పిల్లి రాజశేఖర్ బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

సెల్‌టవర్ ఏర్పాటు చేయొద్దు



ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం వెల్లుల లో సెల్‌టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని గ్రామస్తులు మెట్‌పల్లి మండల పరిషత్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డికి ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన క్యాతం రాజారెడ్డికి సంబంధించిన ఖాళీ స్థలంలో ఓ కంపెనీకి చెందిన సెల్‌టవర్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారని, జనావాసాల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేస్తే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇలియాస్, సోహెల్, ప్రమోద్, రవి, సంజీవ్, రాజేశ్, చందు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

గొర్రెల మందతో నిరసన

మల్లాపూర్: మన ఊరు–మన బడి పథకం కింద లక్షల నిధులు వెచ్చించి నిర్మించిన డైనింగ్ హాల్ బిల్లులు రాకపోవడంతో సోమవారం ఆ పాఠశాల డైనింగ్‌హాల్‌లోకి గొర్రెల మందను తీసుకెళ్లి నిరసన తెలిపిన ఘటన మండలంలోని రేగుంట ప్రభుత్వ పాఠశాలలో చోటుచేసుకుంది. ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ దండికె శంకర్ గత ప్రభుత్వహయాంలో మన ఊరు–మన బడి కింద డైనింగ్‌హాల్‌ను నిర్మించాడు. ఏడాది గడిచినా బిల్లులు చెల్లించకపోవడంతో గొర్రెల మందను తోలి నిరసన వ్యక్తం చేశాడు. తనకు రావాల్సిన బిల్లులను వెంటనే ఇప్పించాలని కోరుతున్నాడు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

జగిత్యాల: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి 35వ వార్డు కౌన్సిలర్ జయశ్రీ లేఖ రాశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు చెందిన జర్నలిస్టులు గత 30 ఏళ్లుగా ఇంటి స్థలాల కోసం అనేక పోరాటాలు చేస్తున్నారన్నారు. ఇంటి స్థలాలు ఇవ్వడం ప్రభుత్వ బాధ్యతని, ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మీడియా పాత్ర చాలా కీలకమైందన్నారు. జగిత్యాల పరిధిలో ఎస్సారెస్పీకి సంబంధించిన భూమి ఉందని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పందించి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయించాలని కోరారు.

సీఎంకు విద్యార్థుల పోస్టు కార్డులు

కోరుట్ల: పట్టణంలోని అరుణోదయ డిగ్రీ కళాశాల విద్యార్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సోమవారం పోస్టుకార్డులు రాశారు. మూడేళ్లుగా విడుదల కాని స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పోస్టుకార్డు ద్వారా విన్నవించారు. స్కాలర్‌షిప్‌లు రాక పోవటంతో పరీక్ష ఫీజులు, కట్టడానికి, పుస్తకాల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నామని, బస్ పాస్‌లకు సైతం ఇబ్బంది పడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ప్రవీణ్, ప్రిన్సిపాల్ నవీన్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ భవాని, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్లను ఆహారంగా తీసుకోవాలి



చిన్నారులతో నరేందర్‌రెడ్డి

జగిత్యాల: విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు రకరకాల పండ్లను ఆహారంగా తీసుకోవాలని అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. అల్ఫోర్స్ కళాశాలలో సోమవారం ఫ్రూట్స్‌ఫెస్టివల్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సీజనల్ ఫ్రూట్స్ తప్పకుండా తీసుకోవాలన్నారు. దీంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం పాల్గొన్నారు.

మత్తు రహిత భారత్‌ను నిర్మిద్దాం



కోరుట్లలో ప్రతిజ్ఞ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు విద్యార్థులు



రాయికల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జగిత్యాల: యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ అన్నారు. సోమవారం మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత చెడు అలవాట్లకు పడి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, చెడుదారులు పట్టకుండా ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీసీపీవో హరీశ్, బాలల సంరక్షణాధికారులు సురేశ్, కరుణశ్రీ పాల్గొన్నారు.

కోరుట్ల: మత్తు రహిత భారత్ నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌసుర్ రహమాన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు సోమవారం మత్తు రహిత భారత్ పై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయికల్: పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలన కోసం ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విద్యార్థులు సోమవారం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గట్టు రమేశ్, నర్సయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారంగాపూర్: డ్రగ్స్ వాడకం ద్వారా మొత్తం సమాజానికే నష్టం జరుగుతుందని సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేశ్ బాబు అన్నారు. విద్యార్థులతో డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు.

బీర్‌పూర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు.

కథలాపూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం మత్తు రహిత భారత్‌ను నిర్మిద్దామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని లెక్చరర్లు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, లెక్చరర్లు పాల్గొన్నారు.

కొత్త బిల్డింగ్‌లో నాసిరకం పనులు



ఆర్డీవోకు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గురుకులాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు సందర్శించారు. నూతనంగా నిర్మించిన భవనాన్ని సోమవారం పరిశీలించిన ఆయన పనులు నాసిరకంగా చేశారని ఆరోపించారు. నాసిరకంగా చేసిన పనుల గురించి ఆర్డీవో శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు.గోడల నుంచి ఇప్పుడే పెచ్చులాగా ఊడుతున్నాయన్నారు.తరగతి గదులు,కిటికీలు,డోర్లు సరిగ్గా ఉన్నాయా లేవా అని తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆటంకాలు లేకుండా చూసుకోవాలని,వారి భద్రత ముఖ్యమని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, డీఈ యూసుఫ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మెట్‌పల్లి పట్టణ అధ్యక్షుడు లింగం,నాయకులు పాల్గొన్నారు.

అదుపులోకి రాని డెంగీ జ్వరాలు



పరీక్షిస్తున్న వైద్యాధికారులు

సారంగాపూర్: మండలంలో డెంగీ జ్వరాలు అదుపులోకి రావడం లేదు. సోమవారం మండలంలోని గణేష్‌పల్లిలో 5 ఏళ్ల బాలుడికి డెంగీ జ్వరం వచ్చినట్లు వైద్యాధికారులు నిర్ధారించారు. దీంతో గ్రామంలో జిల్లా మాతా శిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్‌రెడ్డి, మండల వైద్యాధికారి శివకుమారి, సీహెచ్‌వో కుద్దుస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పెంబట్ల, కోనాపూర్, లచ్చనాయక్‌తండా, పోచంపేట, సారంగాపూర్ గ్రామాల్లో డెంగీ పాజిటివ్ కేసులు గుర్తించారు. డెంగీ జ్వరాల బాధితులకు నయం అవుతున్నప్పటికీ రోజుకో గ్రామంలో డెంగీ పాజిటివ్ రావడం ఆందోళన కలిగిస్తోంది. డెంగీ జ్వరాలను అదుపుచేయడానికి డెప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, జిల్లా మాతాశిశు సంరక్షణాధికారి డాక్టర్ జయపాల్ రెడ్డి పలు గ్రామాల్లో మండలవైద్యశాఖతో కలిసి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రత్యేకాధికారులు సైతం డెంగీ జ్వరాల అదుపునకు పారిశుధ్యంపై దృష్టి పెట్టారు. దోమల నియంత్రణకు గ్రామాల్లో పంచాయతీల ఆధ్వర్యంలో ఫాగింగ్ యంత్రాలను వినియోగించాలని, బావుల్లో క్లోరినేషన్ వారంలో రెండు సార్లు వేయించాలని, మురికి కాల్వలను శుభ్రం చేయించడం, నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వినియోగం మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

కోనోకార్పస్ మొక్కల తొలగింపు

మేడిపల్లి:మండలంలోని కొండాపూర్‌లో సోమవారం కోనోకార్పస్ చెట్లను గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగించారు. కోనోకార్పస్ చెట్లు తొలగించాలని గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఇటీవల పంచాయతీరాజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. స్పందించిన అధికారులు ఆ మొక్కలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులకు బీజేపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శక్తి కేంద్రాల ఇన్‌చార్జి మ్యాకల రాజు, నీలం గంగాధర్, వడ్లగట్ల గణేశ్, చంద రమేశ్, అల్లే రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

కథలాపూర్: మండలకేంద్రంలో కొత్తగా నిర్మించిన రామాలయంలో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవ విగ్రహాలను గ్రామస్తులు ఊరేగించారు. మూడు రోజులపాటు ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల: పట్టణంలోని కేపీఎస్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బేస్‌బాల్ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేశ్ సోమవారం తెలిపారు. పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఈ నెల 10న మంచిర్యాల జిల్లా బెల్లంపెల్లిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

పూడూరు ప్రభుత్వ పాఠశాల తనిఖీ

కొండగట్టు: కొడిమ్యాల మండలం పూడూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీఈవో జనార్దన్‌రావు సోమవారం సందర్శించారు. రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. భాషలో పట్టు లేకుంటే సబ్జెక్టులు అర్థంకావని, విద్యార్థులను సిబ్బంది దత్తత తీసుకుని భాషలో పట్టు సాధించేలా కృషి చేయాలని తెలిపారు. ఇందుకు 30 రోజుల ప్రణాళికను సిద్ధం చేయాలన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలి

ధర్మపురి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలని అసెంబ్లీ కన్వీనర్ కొమ్ము రాంబాబు, కన్నం అంజయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కమలాపూర్‌లో సోమవారం మండలశాఖ అధ్యక్షుడు సంగెపు గంగారాం ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోయారని కాంగ్రెస్ అసమర్థ పాలనపై ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ కో–కన్వీనర్ బండారు లక్ష్మన్, నాయకులు పిల్లి శ్రీనివాస్, కుమ్మరి తిరుపతి, నార్ల విజయ్, కాంద్రపు రమేష్, గాజుల రామదాసు పాల్గొన్నారు.

జగిత్యాల: విద్యాహక్కు చట్టం అమలు చేయాలని స్కూల్ టీచర్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్టీఎఫ్ఐ) నాయకులు అన్నారు. ఎస్టీఎఫ్ఐ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా నాణ్యమైన విద్య, అందరికీ సమాన అవకాశాలు, విద్యాహక్కు చట్టం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్, శ్రీనివాస్, బన్న, ఆగమయ్య, శ్రీధర్,ప్రసాద్, జయంత్‌కుమార్ పాల్గొన్నారు.

క్రీడాకారుల ప్రతిభ

జగిత్యాల:జిల్లాకేంద్రానికి చెందిన క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారు. సోమవారం హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో ఇంటర్నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ టోర్నమెంట్‌లో జగిత్యాల మంకీ ట్విస్ట్ కుంగ్‌ఫూ అకాడమి విద్యార్థులు ఆరు గోల్డ్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేశారు.

స్టేట్ లెవల్ కుంగ్‌ఫూ టోర్నమెంట్

ఈనెల 25న కరీంనగర్‌లో స్టేట్‌లెవల్ కుంగ్‌ఫూ కరాటే టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మాస్టర్ ఆర్.వెంకటేశ్వర్లు తెలిపారు.

స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి

జగిత్యాల: ప్రభుత్వం గత మూడేళ్లుగా స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే విడుదల చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా వెంటనే స్పందించి బకాయిలు విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

హిందువులపై దాడికి నిరసనగా కొవ్వొత్తుల ప్రదర్శన

రాయికల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం రాయికల్ పట్టణంలోని అంగడిబజార్‌లో, మండలంలోని మూటపల్లిలో యువకులు, ప్రజాప్రతినిధులు కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటించి నిరసన వ్యక్తం చేశారు.

ఏఐఎస్ఎఫ్ రాజీ లేని పోరాటం

జగిత్యాలటౌన్: విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ముందుంటుందని జిల్లా అధ్యక్షుడు అక్రమాలిక్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల సమితి కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 89వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు వెన్న మహేశ్, రాకేశ్, దిల్షాన్ పాల్గొన్నారు.

జేసీబీ ప్రారంభించిన ఎమ్మెల్సీ

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామానికి చెందిన బోరె చంద్రయ్య కొనుగోలు చేసిన జేసీబీని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సోమవారం ప్రారంభించి రైతు చంద్రయ్యకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్, బాపురెడ్డి, రాజన్న, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులను ఆదుకోవాలి

ఇబ్రహీంపట్నం: పెద్దాపూర్ గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురై మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని మండలంలోని బర్దీపూర్ మాజీ సర్పంచ్ సంగం సాగర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో గురుకుల విద్యాలయాల్లో విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోతున్న ప్రభుత్వానికి నిమ్మకు నీరు ఎత్తినట్లుగా లేదన్నారు. విద్యార్థుల కుటుంబాలకు ఒకొక్కరికి రూ. 10 లక్షలు నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. గురుకుల పాఠశాలల్లో ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

- **రోడ్డు ప్రమాద బాధితులకు పరామర్శ**

ధర్మపురి : మండలంలోని నేరెళ్ల గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ధర్మపురికి చెందిన శ్యామంతుల సునీల్‌కుమార్ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ బాదినేని రాజేందర్ పరామర్శించారు.

- **డీజే బాక్సుల వితరణ**

మల్లాపూర్: మండల కేంద్రంలోని గిరిజన(ఎస్టీ) మినీ గురుకుల బాలికల పాఠశాలకు సోమవారం స్థానిక నాయకుడు పల్లికొండ నారాయణ రూ.6వేల విలువ గల డీజే బాక్సులను విరాళంగా అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **సర్పంచ్ పదవిని బీసీకి రిజర్వు చేయాలి**

మల్లాపూర్: మల్లాపూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని బీసీకే రిజర్వు చేయాలని మాజీ ఎంపీటీసీ మొరపు గంగరాజం అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక నాయకులతో కలిసి తహసీల్దార్ వీర్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు ముద్దం సత్యనారాయణగౌడ్, అందె దేవరాజ్, బెజ్జారపు సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

- **ధాన్యం కొనుగోలు కమిషన్ నిధులను రైతులకు తెలపాలి**

మల్లాపూర్: ముత్యంపేట ప్యాక్స్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కమిషన్ నిధుల వివరాలను రైతులకు తెలపాలని ఆ సంఘం పరిధిలోని రాఘవపేట, ముత్యంపేట రైతులు అన్నారు. సోమవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట ప్యాక్స్ కార్యలయంలో సీఈవో రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. సొసైటీ ద్వారా నిర్వహించిన ఆదాయ, వ్యయాలను రైతులకు వివరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాజేష్, శేఖర్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **విద్యార్థి ఔదార్యం**

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గుమ్మడి సంతోష్–లుదియ దంపతుల కుమార్తె జెస్సిక తన పుట్టినరోజు సందర్భంగా సోమవారం ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పండ్లు పంపిణీచేశారు.

- **హోటల్ యజమానులకు ప్లేట్లు పంపిణీ**

రాయికల్: మండలంలోని భూపతిపూర్ గ్రామంలో అల్పాహార సమయంలో హోటల్ యజమానులు న్యూస్ పేపర్‌లో అల్పాహారం విక్రయించడంతో కలిగే అనర్థాలను గమనించిన భౌతికశాస్త్ర ప్రభుత్వ ఉపాధ్యాయుడు బొల్లె చిన్నయ్య సోమవారం హోటల్ యజమానులకు స్టీల్‌ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్,మహేశ్వర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

- **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ**

రాయికల్: మండలంలోని తాట్లవాయికి చెందిన గడ్డం మహేశ్, సీపెల్లి భూంరెడ్డిలకు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చొరవతో ఒక్కొక్కరికి రూ.60 వేలు సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు మంజూరు కాగా, సోమవారం కాంగ్రెస్ నాయకులు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోసరి మహేశ్, నాయకులు పాల్గొన్నారు.

- **కృతజ్ఞత సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు**

మేడిపల్లి: మాదిగల కృతజ్ఞత సభ విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరికి ఎమ్మార్పీఎస్ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మేడిపల్లి రైతు వేదిక నుంచి ర్యాలీగా బయలుదేరి మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికినివాళి అర్పించి, అనంతరం మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీమకిలి ఇజ్రయిల్, టాయ్స్ అధ్యక్షుడు భంగారు దీపక్, కాచారం చిట్యాల సురేష్, దువాస గంగాదర్, ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

- **ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి**

ఇబ్రహీంపట్నం: సుప్రీంకోర్టు ఎస్సీ కులాల వర్గీకరణ చేయాలని తీర్పు ఇచ్చినందునా కేంద్ర ప్రభుత్వం వెంటనే బాధ్యత వహించి ఆర్డినెన్స్ ద్వారా రాష్ట్రాలకు ఆదేశాలు ఇవ్వాలని తెలంగాణ జనసమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేసి, దళితుల్లో వెనుకబాటుకు గురైన వర్గాలను అభ్యున్నతిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

ఆలయంలో రేకుల పందిరి నిర్మాణానికి భారీ విరాళం

పెగడపల్లి:మండల కేంద్రంలోని శివాలయంలో ముందు భాగంలో భక్తులను నీడ సౌకర్యం కల్పించేందుకు ఓ భక్తుడు భారీ విరాళం ప్రకటించారు. గ్రామానికి చెందిన రిటైర్డు ఎస్సై మూల వెంకట్‌రెడ్డి –రుక్మిణి దంపతులు రూ. 6,80,000 లక్షలు ఆలయ అభివృద్ధికి అందజేయగా అట్టి రేకుల పందిరి నిర్మాణ పనులను సోమవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, మాజీ సర్పంచి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

- **భక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవం**

పెగడపల్లి:మండల కేంద్రంలోని శివభక్త మార్కండేయ ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గౌరి గణాధిపతి పూజ, రుద్రాభిషేకం, అర్చనలు అభిషేకాలు, అఖండ దీపారాధన, రుద్ర, నవగ్రహ హోమాలు నిర్వహించి భక్తులకు అన్న దానం చేశారు. . కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గాజుల నర్సయ్య, పద్మశాలీ సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

- **నేత్ర వైద్యశిబిరానికి స్పందన**

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో సోమవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి స్పందన లభించింది. వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు దూలూర్ గ్రామానికి వచ్చి కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఇందులో 37 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కథలాపూర్ మండలశాఖ ప్రతినిధులు సంజీవ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సతీశ్‌గౌడ్, పరమేశ్వర్, జనార్దన్‌రెడ్డి, ఎం జీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- **తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చాలి**

మల్యాల: తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలు నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జగిత్యాల జిల్లా ఫోరం అధ్యక్షుడు జవ్వాజి శంకర్ అన్నారు. ఉద్యమకారుల సభ్యత్వ నమోదులో చేపట్టాలని, తెలంగాణ కోసం ఉద్యమించిన ఉద్యమకారులను ఏకతాటిపైకి తీసుకువచ్చి, లక్ష్యాలను సాధించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామన్నారు. త్వరలో జిల్లా, మండల కమిటీలు ఏర్పాటు చేసి, ఉద్యమకారుల ఆకాంక్షల సాధన కోసం మరింత ఉద్యమిస్తామని శంకర్ అన్నారు.

- **నేడు రైతు వేదికలో రైతులకు శిక్షణ**

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులపై శాస్త్రవేత్తలు రైతులకు సూచనలను, సలహాలను ఇవ్వనున్నట్లు ఏవో దీపిక సోమవారం తెలిపారు.

- **వీవీరావుపేటలో ప్రభుత్వ దిష్టి బొమ్మ దహనం**

మల్లాపూర్: గురుకుల పాఠశాలలపై సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండలంలోని వీవీరావుపేటలో సోమవారం బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని దుయ్యబట్టారు. బాధిత కుటుంబాలకు రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా అందించి ప్రభుత్వపరంగా అన్నిరకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వేల్పుల గంగారెడ్డి, బిట్ల నరేశ్, బీఆర్ఎస్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

- **స్పోర్ట్స్ డ్రెస్సులు పంపిణీ**

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం ఎల్.శంకరయ్య సొంత ఖర్చులతో సోమవారం స్పోర్ట్స్ డ్రెస్సులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హెచ్‌ఎంకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు కోయిల లక్ష్మి, రాజశేఖర్, శంకర్ పాల్గొన్నారు.



పొలం మడి కాదు.. మేడిపల్లిలోని ప్రధాన రహదారి

మేడిపల్లి: ఉమ్మడి మేడిపల్లి మండల వ్యాప్తంగా చాలా చోట్ల ప్రధాన రహదారులు దెబ్బతిన్న అధికారులు పట్టించుకోవడం లేదు. మేడిపల్లి నుంచి మోత్కరావుపేట వెళ్లే దారి చాలా చోట్ల గుంతలు ఏర్పడి నీళ్లు నిలిచి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని నాలుగు ప్రధాన దారుల పరిస్థితి ఇలాగే ఉంది. భీమారం మండల కేంద్రంలోని గడి వద్ద ప్రధాన రహదారి పొలం మడిలా తలపిస్తోంది. అంత బురదతో నిండి దోమలకు ఆవాసంగా మారింది. అటుగా స్కూళ్లకు వెళ్లే పిల్లలు బురదలో నుంచే వెళ్లాల్సి వస్తోంది. బురదలో నుంచి వాహనాలు వెళ్తే పాదాచారులపై పడుతుంది. ఉమ్మడి మండలంలోని మేడిపల్లి, కొండాపూర్ గ్రామాల్లో బైపాస్ రోడ్లు వేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639

క్రైం కార్నర్

వ్యక్తి అదృశ్యం

కథలాపూర్: మండలంలోని తుర్తి గ్రామానికి చెందిన కొలకాని మల్లేశం అనే 50 ఏళ్ల వ్యక్తి అదృశ్యమైనట్లు గ్రామస్తులు సోమవారం తెలిపారు. మల్లేశం ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు ఆయా గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వాకబు చేశారు. అయినప్పటికీ ఆచూకీ దొరకలేదు. మల్లేశం అదృశ్యమైనట్లు బాధిత కుటుంబసభ్యులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నిందితుడి అరెస్టు

పెగడపల్లి:మండలంలోని సుద్దపల్లి గ్రామంలోని ఓ ఫర్టిలైజర్ అండ్ పెస్టిసైడ్స్ దుకాణంలో పనిచేస్తూ దుకాణం యాజమానిని మోసం చేసిన కేసులో నిందితుడిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై రవి కిరణ్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని బతికపల్లి గ్రామానికి చెందిన క్యాస కృష్ణ అనే వ్యక్తి సుద్దపల్లి గ్రామంలో శ్రీకృష్ణ ఫర్టిలైజర్ దుకాణం నిర్వహిస్తుండగా బతికపల్లి గ్రామానికి చెందిన మారిశెట్టి మధు అనే వ్యక్తి దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎరువులు విక్రయించిన రైతుల నుంచి రూ. 2 లక్షల వరకు సొంతానికి వాడుకున్నాడు.వాడుకున్న నగదుకు లెక్క చూపకుండా ఖాతా బుక్కులను కాల్చి వేశాడని ఎస్సై తెలిపారు. దుకాణ యాజమాని కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి మధును అరెస్టు చేసినట్లు ఎస్సై వివరించారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మల్యాల: మండలంలోని ముత్యంపేట పరిధి దిగువ కొండగట్టులో ఓ గదిలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు సోమవారం సాయంత్రం ఎస్సై నరేశ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురి నుండి రూ.44,060/–నగదు స్వాధీనం చేసుకున్నారు. ఏడుగురిపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.